'తెలుగు కళాసమితి' (న్యూజెర్సీ)వారి కథల పోటీలో ప్రథమ స్థాయిలో 5,000 రూపాయిల బహుమతి నందుకున్న కథ

# నా కొరకు చెమ్మగిల్లు...

నేను చూస్తున్నాను

నిర్నిమేషంగా చూస్తున్నాను.

నా పెద్దకొడుకు మహేశ్ టైగర్‌ను ప్రేమగా దువ్వుతూ ఏదో ఆలోచిస్తున్నాడు.

మహేశ్ కళ్ళు చెమ్మగిల్లాయా? అవును.

టైగర్ మా ఇంట్లోనే జన్మించిన మా పెంపుడు కుక్క.



కుక్క అనేది జాతి కనుక అనక తప్పదుగానీ మనిషి కన్నా ఇంగితం, విశ్వాసం కలది టైగర్. ఎంత వేగం! ఎంత చురుకు! ఎంత సౌందర్యం! అవన్నీ ఇప్పుడు ఏమైపోయాయి? నాలాగే టైగర్‌ను కూడా వృద్ధాప్యం కబళించింది.

శ్వాస తీసుకోవడం కూడా కష్టమైపోయి మూడు రోజులుగా మరణయాతన అనుభవిస్తూ, మూగగా భరిస్తూ కన్నీరు విడుస్తోంది టైగర్.

మహేశ్ ఏదో ఆలోచిస్తూ టైగర్‌ను ఆప్యాయంగా దువ్వుతున్నాడు. మహేశ్ ఆలోచన దేన్ని గురించి?

టైగర్ రొప్పుతోంది...ఆ దృశ్యం హృదయవిదారకంగా వుంది. మహేశ్ కళ్ళల్లో నీళ్ళు...

"బాబూ! మహేశ్... బాధపడకు" అని ఓ ఓదార్పుమాట పలికేందుకు కూడా అశక్తుణ్ణి.

జరా భారం నా జవసత్త్వాలను పిల్చి పిప్పి చేసి నన్ను శల్యావశిష్టుడిని చేస్తే, పక్షవాతం అనే వ్యాధి నా శరీరావయవాల కదలికతోపాటు నా మాటను కూడా కబళించింది.

మంచం మీద నుండి కదలలేని, ఓ మాట మాట్లాడలేని, ఓ పలుకు వినలేని వృద్ధ రోగిని. ఆ పైవాడి పిలుపు కోసం ఎదురు చూస్తూ క్షణక్షణం దుర్భరమైన ఈ జీవితాన్ని అసహ్యించుకుంటూ మరణాన్ని ఆహ్వానిస్తూ క్షణమొక యుగంగా జీవిస్తున్నాను.

ఒక్కోసారి...ఒక్కోసారి ఏమిటి..ప్రతి క్షణం ఆత్మహత్య చేసుకుని ఈ జీవితాన్ని ముగిద్దామనే ఆవేశం కలుగుతుంది. అందుకూ నేను అశక్తుణ్ణే అని స్ఫురించి కళ్ళు

'కృష్ణజ'

7-4-95 ఆంధ్రజ్యోతి వారపత్రిక

చెమ్మగిల్లుతాయి. హృదయం దుఃఖభారంతో రోదిస్తున్నా కళ్ళు ఒక్క కన్నీటి చుక్కను చిందించేందుకు కూడా అశక్తాలు.

ప్రాణులకు వృద్ధాప్యం ఒక భయంకర శాపం కదా! ఒక్క మాటలో చెప్పాలంటే ఆ మూగజీవి టైగర్ పరిస్థితికీ నాకూ ఏమీ తేడా లేదు.

కానీ, నాకంటే కూడా టైగర్ అదృష్టవంతురాలు. టైగర్‌కు మహేశ్ ప్రేమ, ఆప్యాయతలు మిగిలాయి. చివరి క్షణాల్లో టైగర్ మహేశ్ నుండి ఓ కన్నీటి చుక్కను పొందగలుగుతోంది.

మరి...నేను...? నాకేం మిగిలింది? నాకు ఇద్దరు కొడుకులు. మహేశ్ తరువాత గర్భవతి అయిన నా భార్యకు 'స్కానింగ్' చేయించాను. గర్భంలోనిది 'ఆడ శిశువు' అని రిపోర్ట్ రావడంతో అబార్షన్‌కు ఏర్పాటు చేయించాను.

"ఓర్పు, దయ, కరుణ, ప్రేమ, మమకారాలు ఆడపిల్లలకే ఎక్కువ వుంటాయండీ, రేపు మన ముసలితనంలో పిడికెడు సానుభూతి, ఓ కన్నీటి చుక్క లభించేది మనకు ఆడపిల్ల వద్దనుండేనండీ" అంటూ నచ్చచెప్పబోయిన నా భార్యను సెంటిమెంటల్‌ఫూల్‌గా మనస్సులో ఈసడించుకుని, మమకారాలూ లేవు మరమరాలూ లేవు...అంటూ 'బి ప్రాక్టికల్' అనే సలహాలాంటి ఆజ్ఞను జారీచేసి ఆమె నోరు మూయించాను.

ఆ తరువాత సురేష్ పుట్టాడు. లక్షల లక్షల కట్నంతో పిల్లను అత్తవారింటికి సాగనంపే బాధ్యత నుంచి తెలివిగా తప్పించుకున్నందుకు నన్ను నేనే అభినందించుకున్నాను.

మా దగ్గరే పెరిగితే తల్లి తన ప్రేమతో పిల్లల్ని పాడుచేస్తుందేమో...అనే భయంతో పిల్లల్ని ఖరీదయిన హాస్టల్లో వుంచి గొప్ప చదువులు చదివించాను. మహేశ్ ఇప్పుడు దేశంలోకల్లా పెద్ద కార్డియాలజిస్ట్. చిన్నవాడు విదేశాల్లో గొప్ప బిజినెస్ మాగ్నట్.

గొప్ప ప్రాక్టికల్ నాలెడ్జితో నా పిల్లల్ని అలా తీర్చి దిద్దుకున్నందుకు మరోసారి నన్ను నేను అభినందించుకున్నాను.

నా భార్యకు జబ్బు చేసింది.

రోజులో కనీసం ఓ పది నిముషాలయినా తన దగ్గర కూర్చోమని ప్రాధేయపడేది. "సెంటిమెంటల్ ఫూల్!. మందులు పనిచెయ్యాలి గానీ, నేను దగ్గర కూర్చుంటే రోగం తగ్గిపోతుందా?"

నాకు ఎన్ని పనులు? నేను అటెండ్ కావలసిన సెమినార్స్ ఎన్ని? సబ్‌మిట్ చేయవలసిన పేపర్లు ఎన్ని, ఈవిడ దగ్గర కూర్చుంటే నాకెలా కుదురుతుంది?

నా భార్య చనిపోయింది.

ఆ సమయంలో కూడా నేను ఆమె దగ్గర లేను.

"మెర్సీ కిల్"కు సంబంధించిన సెమినార్‌లో పాల్గొనేందుకు వెళ్ళాను.

"తనకు తనుగానీ సమాజానికిగానీ, ఉపయోగపడకపోగా, నయంకాని వ్యాధులతో నరకాన్ని అనుభవించే దీర్ఘరోగులను మానవతా దృష్టితో చనిపోయేందుకు సహాయపడేందుకు ప్రభుత్వాలు చట్టాలుచేయాలి. మెర్సీ కిల్ హత్య కాదు.



వృద్ధాప్యం అనేది సూర్యాస్తమయ సమయం లాంటిదే. పసిడివేకువ పెండ్లిండ్ల హుషారులో పడినవారు నన్ను పట్టించుకోరు, నా కొరకు చెమ్మగిలు నయనమ్ము లేదు.... అనుకుంటోంది దీనంగా. కానీ, ఆదినం పట్టరావి పట్టపగలై వెలిగినప్పుడు, అవ్యక్తి, అజ్ఞాన అహంకారాల జోడు గుర్రాలపై స్వారీ చేసినప్పుడు.. ఏ ప్రాణిపై కరుణ చూపినట్టు? ఎవరికోసం కన్ను చెమ్మగిలినట్టు? ఇప్పుడు తనకోసం చెమ్మగిలే కన్నుకావాలంటే కనిపిస్తుందా? తానెంతో తనయుడూ అంతే కాదా!

పాపం కాదు. నేరం కాదు. పైగా దీర్ఘరోగులకు, వయోభార పీడితులకు మనం ఇచ్చే ఒక వరం" ఈ విధంగా సాగిన నా ఉపన్యాసానికి సభికులు జేజేలు పలికారు. కానీ ఆనాటి నా భావాలు ఈనాడు లేవెందుకని?

"హలో...డాడ్...హౌవార్యూ?" అనేసి రోజుకోసారి మొక్కుబడిగా పలకరించి కనీసం నా కంటి చూపును కూడా పట్టించుకోని మహేశ్‌ను చూస్తుంటే నా గుండె లోతుల్లో దుఃఖం పొర్లుతుందెందుకని?

నా కోడలు కనీసం పలకరించే తీరికైనా లేనంత బిజీ... మనుమలు...పసివాళ్ళు... నా గది ఛాయలకే రారు. రానీయరు...(నా కొడుకులు నాలాగే ప్రాక్టికల్. అందుకే నాకు మనుమలే తప్ప మనుమరాళ్ళు లేరు) నన్ను కనిపెట్టుకుని వుండి నా అవసరాలు తీర్చేందుకు ఓ ఆయాను ఏర్పాటుచేశారు.

ఈ వృద్ధ రోగికి సేవలు చేయవలసి వచ్చిన దౌర్భాగ్యానికి ఆ ఆయా ముఖం ఎప్పుడూ ధుమ ధుమ లాడుతూనే వుంటుంది. నాకే ఓ కూతురు వుండి వుంటే...?

కనీసం సంవత్సరానికోసారి నన్ను చూసేందుకు వచ్చినా, "నాన్నా! ఇప్పుడెలా వుంది?" అంటూ నా పక్కన కూర్చునేది కాదూ? ఎలా అయిపోయావు నాన్నా? అంటూ నా శరీరమంతా తన చేతులతో తడిమి నా చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని కన్నీళ్ళు పెట్టుకునేది కాదూ? తనవారు తనకొరకు విడిచే ఆ కన్నీటి చుక్కలో అంత ఆత్మశాంతి వుంటుందనే విషయం నాకిప్పుడే అనుభవంలోకి వస్తోంది.

"నాన్నా! ఇదిగో నీ మనుమలు. ఇది నీ మనుమరాలు. అమ్మపేరే పెట్టుకున్నాం" అంటూ పిల్లల్ని చూపించేది కాదూ...? వారు తమ చిట్టి చిట్టి చేతుల్తో నా కన్నీరు తుడిచేవారు కాదూ?

"నా కొరకు చెమ్మగిలు నయనమ్ము లేదు" ఎప్పుడో ఎక్కడో విన్న ఏదో పద్య చరణమొకటి ప్రతి క్షణం నా హృదయంలో మ్రోగుతూంది. నా కొడుకు చెమ్మగిలే నయనం కొరకు తపిస్తున్నాను. అలమటిస్తున్నాను. ఆక్రోశిస్తున్నాను. దేవిరిస్తున్నాను. టైగర్ పొందగలిగిన ఆ కన్నీటి చుక్క నేనెందుకు పొందలేక పోతున్నాను? నేను చేసిన పాపం ఏమిటి?

మహేశ్ ఎంతోసేపటికి ఒక నిర్ణయానికి వచ్చినవాడిలా తటాలున లేచి నా గదిలో మెడిసిన్స్ అవీ అమర్చిన ఓ పెద్ద టేబిల్ వద్దకు వెళ్ళాడు.

నేను ఆశ్చర్యంగా చూస్తున్నాను.

మహేశ్ ఓ మందు సిరంజ్‌లోకి ఎక్కించడం చూశాను. ఈసారి ఆశ్చర్యంతోపాటు భయంతో నా కళ్ళు పెద్దవయ్యాయి. కారణం ఆ మెడిసిన్ ఏమిటో నాకు తెలుసు. క్షణాల్లో అతి సులువుగా ప్రాణంతీయగల అతిశక్తిమంతమైన 'పాయిజన్'.

మహేశ్ అడుగులు వేసి ముందుకు వస్తోంటే ఆ అడుగులు నా గుండెల మీదే పడుతున్నట్టు ఫీలింగ్. మహేశ్ గది బయటికి వెళ్ళిపోగానే పెద్ద బరువు దించుకున్న రిలీఫ్.

మహేశ్ టైగర్‌కు ఇంజక్షన్ చేసి వెనుదిరిగాడు. వాడి చూపులతో నా చూపులు కలుసుకున్నాయి. మహేశ్ తరువాతి టార్గెట్...ఎవరు...ఎవరు? ప్రాణ భయంతో నా రక్తం చల్లబడిపోయింది.